# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 151 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

16-04-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# జొన్న రైతుల కష్టాలు ధర్మాన ఆగ్రహం

- మద్దతు ధర అమలుపై ప్రశ్నలు
- ఎరువుల కొరతతో రైతులకు నష్టం
- బ్లాక్ మార్కెట్ ఆరోపణలు
- 80 వేల ఎకరాల్లో కోట్ల నష్టం





**నవతరం -గార**

జిల్లాలో జొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆందోళన వ్యక్తం చేశారు. గార మండలంలోని వాడాడ, కొత్తూరు, అచ్చెనపాలెం, బలివాడ గ్రామాల్లో రైతులను కలిసి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. క్వింటాలుకు రూ.2400 మద్దతు ధర ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున జొన్న సాగు చేపట్టారని ఆయన పేర్కొన్నారు. అయితే పంట వేసే కీలక సమయంలో ఎరువుల సరఫరాలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కొందరు టిడిపి కార్యకర్తలు ఎరువులను దోచుకుని బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించడంతో రైతులకు సరైన ధరకు ఎరువులు అందలేదని ఆరోపించారు. రూ.280కి లభించాల్సిన ఎరువులను రూ.600 వరకు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తనకు తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు జరగకపోతే రైతులకు కలిగిన నష్టాన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నించిన ధర్మాన, "ప్రైవేట్ వ్యక్తులు మాట తప్పొచ్చు కానీ ప్రభుత్వం మాట తప్పడం సరికాదు" అని అన్నారు. జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో జొన్న సాగు జరిగిందని, ఒక్కో ఎకరానికి సుమారు రూ.2800 నష్టం వస్తోందని తెలిపారు. మొత్తం మీద సుమారు రూ.240 కోట్ల మేర రైతులు నష్టపోతున్నారని అంచనా వేశారు. ఇక మార్కెట్లో కొందరు బ్రోకర్లు క్వింటాలుకు రూ.1800కంటే ఎక్కువ ఇవ్వొద్దని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విజిలెన్స్, ఇంటెలిజెన్స్, వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అలాంటి బ్రోకర్లపై వెంటనే చర్యలు తీసుకుని, రైతులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.2400 మద్దతు ధర అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

రైతుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలని, ముఖ్యమంత్రి అత్యున్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. గతంలో ప్రభుత్వం రైతుల వద్దకే వెళ్లి పంటను కొనుగోలు చేసి వారికి న్యాయం చేసిందని గుర్తుచేశారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించిన ధర్మాన, పరిస్థితి ఇలానే కొనసాగితే తీవ్ర పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందని అన్నారు.

# గౌతు శిరీషకు కీలక బాధ్యత

## టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం





**నవతరం - పలాస**

తెలుగుదేశం పార్టీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గారికి కీలకమైన పదవి దక్కింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే గౌతు శిరీష తనపై నమ్మకంతో ఈ భారీ బాధ్యతను అప్పగించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, గౌరవనీయులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, అలాగే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ నారా లోకేష్ గారికి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

"తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవ చేసే అరుదైన అవకాశాన్ని కల్పించినందుకు పార్టీకి రుణపడి ఉంటాను. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతం కోసం మరియు ప్రజల సేవ కోసం పూర్తి నిబద్ధతతో, నిరంతర కృషితో ముందుకు సాగుతాను." అని పేర్కొన్నారు.

పలాస నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆమెకు ఈ పదవి దక్కడం పట్ల పలాస నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అలరించిన సుమధుర సినీ నేపథ్య గేయాలు

- సుమధుర గాయకులు పిబి.శ్రీనివాస్
- ప్రముఖ వైద్యులు డా. కె. అమ్మన్నాయుడు




**నవతరం -శ్రీకాకుళం**

సుమధుర గాయకులు పిబి.శ్రీనివాస్ అని, ప్రముఖ వైద్యులు డా. కె.అమ్మన్నాయుడు అన్నారు. మధుర సినీ నేపధ్య గాయకులు శ్రీ పిబి శ్రీనివాస్ మూడవ వర్ధంతి సంస్మరణార్థం, శ్రీ గాయత్రి స్వరాంజలి ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో, విశ్రాంత వాణిజ్య పన్నుల అధికారి చౌదరి రమేష్ నిర్వహణలో సీనియర్ గాయకులు ఆకాశవాణి కళాకారులు కేఎల్ఎన్ మూర్తి సంగీత సారధ్యంలో ఆపాత మధుర గీత మందారాలు స్థానిక బాపూజీ కళామందిర్ లో మంగళవారం జరిగాయి. ముందుగా సీనియర్ నాయకులు రాధాకృష్ణ పాణిగ్రహిచే భగవద్గీత గానంతో సభా కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ డాక్టర్ కే.అమ్మ నాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సేల్స్ టాక్స్ విశాఖపట్నం జి రాణి మోహన్, స్టేట్ పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ అమరావతి చౌదరి పురుషోత్తం నాయుడు, ఏ.టాప్ గ్రేడ్ -మిగతా 2లో

# నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



**నవతరం -టెక్కలి**

విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం కింద నాణ్యమైన భోజనాన్ని అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి మంత్రి సందర్శించారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తుంది లేనిది, వడ్డించిన ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. వంటకాలను స్వయంగా రుచి చూసి విద్యార్థినులతో కలిసి నేలపై కూర్చుని సహపంక్తి భోజనాలను చేశారు. రోజువారి మధ్యాహ్న భోజన పథకం అమలు మెనూను విద్యార్థులకు అడిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల్లో పౌష్టికాహారం లోపం లేకుండా మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు అవసరమైన -మిగతా 2లో

# ఖైదీల హక్కుల రక్షణ మనందరి బాధ్యత

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



**నవతరం -శ్రీకాకుళం**

జైళ్లలో విచారణ ఎదుర్కొంటున్న ముద్దాయిల హక్కులను కాపాడటంతో పాటు, వారికి చట్టపరమైన వెసులుబాటు కల్పించడం ద్వారా సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ ద్వారా బెయిల్ లభించినా బయటకు రాలేకపోతున్న వారు, మహిళలు, మరియు దీర్ఘకాలిక వ్యాధులతో -మిగతా 2లో

# జర్నలిస్టుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటం

## ఐ ఎఫ్ డబ్ల్యు జె స్టేట్ ఇంచార్జ్ ఎన్. ఈశ్వరరావు 2లో






ఎడిటోరియల్

# విశ్వాసమా! వివక్షా?

దేశంలోని ఆలయాలు, ప్రార్థనాస్థలాల్లోకి నిషేధాజ్ఞలపై సుప్రీం కోర్టులో జరుగుతున్న విచారణ దేశవ్యాప్తంగా కీలకమైన చర్చకు దారితీసింది. శబరిమలలోకి మహిళల ప్రవేశంపై ఆంక్షలు కొనసాగాలా? లేదంటే రాజ్యాంగ సూత్రాలను నిలబెట్టాలా?- అన్న మౌలిక ప్రశ్నల మధ్య ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య మూలాల్ని మరోసారి గుర్తుచేశాయి. ఈ క్రమంలో జరిగిన చర్చల్లో విశ్వాసాల పేరుతో ఆంక్షలపర్వం అంతరాలను పెంచుతుందని, ఫలితంగా ఇది హిందూ మతంపై దుష్ప్రభావాన్ని చూపుతుందని కోర్టు పేర్కొంది. 'శబరిమల ఆలయం సహా ప్రార్థనా స్థలాల్లో మహిళలపై వివక్ష' కేసులో ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మిశ్రాతో కూడిన ధర్మాసనం అనేక అంశాలను లేవనెత్తుతోంది. 'మహిళల శరీరధర్మాలను ఆచారాలకు ముడిపెట్టి ఆంక్షలు విధించడం సమంజసమేనా?' అన్న జస్టిస్ బి.వి.నాగరత్న వ్యాఖ్యల ఆధారంగా విచారణ సాగుతోంది. తుది తీర్పు వెలువడ కున్నా ధర్మాసనం చేసిన వ్యాఖ్యల్లో ప్రధానంగా మహిళలపై వివక్ష ఉండకూడదని, విశ్వాసాల పేరుతో వారిని 'పరిమితం' చేయకూడదనే మౌఖిక అభిప్రా యం వ్యక్తమైంది. అయినప్పటికీ కొన్ని శక్తులు, సంస్థలు ఈ విషయాన్ని రాద్ధాంతం చేస్తూ, మత విశ్వాసాలను భావోద్వేగాలతో ముడిపెట్టి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం శోచనీయం.

విచారణలో ముఖ్యంగా రెండు అంశాలు ప్రధానంగా ముందుకొచ్చాయి. ఒకటి, సంప్రదాయాల పేరుతో మహిళల ప్రవేశంపై విధించిన ఆంక్షలు. రెండు, వాటిని సమర్థిస్తూ కేంద్రం చేసిన వాదనలు. ఈ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చేసిన వాదన హేతుబద్ధంగా లేకపోవడం అనేక విమర్శలకు గురైంది. శబరిమల ఆచారాలు ప్రత్యేకమని, ఆచార, విశ్వాసాలకు కట్టుబడి ఉండాలన్న ధోరణి సమాజ సమానత్వాన్ని దెబ్బతీస్తోంది. దేశంలోని కొన్ని ఆలయాల్లో పురుషులకు కూడా అనుమతిలేదని వాదించడం, "న్యాయమూర్తులు చట్టంలో నిపుణులు, మతంలో కాదు" అని కోర్టు జోక్యాన్ని ప్రశ్నించడం, రాజ్యాంగానికి విలువ ఇవ్వకపోవడమే అవుతుంది. పది నుంచి యాభై ఏళ్ల మధ్య వయసున్న మహిళలు ఆలయంలోకి వెళ్లకూడదనే నియమం సహజ శరీర ప్రక్రియలను అపవిత్రంగా చూడటమే తప్ప మరొకటికాదు. ఇది శాస్త్రీయంగా, మానవీయంగా, రాజ్యాంగ పరంగా కూడా నిలబడలేని వాదన. ధర్మాసనం కూడా ఇదే విషయాన్ని గట్టిగా ప్రస్తావించింది. "మహిళల సహజ శరీర ధర్మాలను అపవిత్రంగా చూడటం ఎలా సమంజసం" అని ప్రశ్నించడం ద్వారా ఆచారాల వెనుక అణచివేత భావజాలాన్ని బహిర్గతం చేసింది.

ఈ నేపథ్యంలో కేరళలో గతంలో జరిగిన పరిణామాలు కూడా మరింత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. 2018లో సుప్రీంకోర్టు మహిళలపై ఉన్న నిషేధాన్ని రద్దుచేస్తూ తీర్పునిచ్చింది. వామపక్ష ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రాజ్యాంగబద్ధ నిర్ణయాన్ని అమలు చేయడానికి ప్రయత్నించగా బీజేపీ, ఆరెస్సెస్, సంఫ్ పరివార్ నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఈ అంశాన్ని భావోద్వేగాలతో అంటకట్టి ప్రజల్ని ఏమార్చి ఆందోళనలు చేపట్టి హింసాత్మక ఘటనలకు తెరదీసింది. మహిళల ప్రవేశాన్ని అడ్డుకోవడం ద్వారా 'హిందూ ఐక్యత' పేరుతో విభజన సృష్టించడం, ఐక్యతకు బదులు అసమానతను పెంచింది. దీంతో అక్కడి లెఫ్ట్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసినా సామర స్యాన్ని కాపాడుతూనే అక్కడి అననుకూలతను సర్కార్ సరిదిద్దుకుంటూ వచ్చింది. ఇది కేవలం మత విశ్వాస రక్షణ కాదని, ఒక రాజకీయ వ్యూహంలో భాగమేనని అప్పటి పరిస్థితుల ద్వారా వెల్లడైంది. కేంద్రం వినిపించిన 'ఆచారం కాపాడాలి' అన్న వాదనలో మహిళల హక్కులపై స్పష్టత కనిపించదు. ఇది రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 14 సమా నత్వ హక్కును పక్కన పెడుతుంది. అందుకే, మతాచారాలు వ్యక్తిగత విశ్వాసాలకు సంబంధించి నవే కానీ, అవి రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులను దాటి వెళ్లలేవని కోర్టు స్పష్టం చేసింది.

గత విచారణల్లో కూడా ధర్మాసనం "మహిళలను అస్పృ శ్యులుగా చూడటం సరికాదు" అని చెప్పింది. ఆ వ్యాఖ్యలే నేడు ఈరోజు చర్చకు పునాదిగా నిలిచాయి. తాజా విచారణ సందర్భంగా "ఒక వర్గాన్ని దేవుడి పేరుతో దూరంగా ఉంచడం, అది మతస్వేచ్ఛకంటే కూడా వివక్షగా మారుతుంది" అన్న కోర్టు భావన వాస్తవం. మహిళా కోణంలో చూస్తే శబరిమల వివాదం మరింత తీవ్రంగా కనిపిస్తుంది. 'నెలసరి'ని అపవిత్రంగా చూపించడం వారి గౌరవాన్ని దెబ్బతీయటమే. ఆచారాల పేరుతో ఈ భావజాలాన్ని కొనసాగించడం సమాజాన్ని తిరోగమనంలో పడేస్తుంది. సమానత్వం, గౌరవం, స్వేచ్ఛ మహిళలకు కల్పించిన రాజ్యాంగ మూలహక్కులు. మతం పేరుచెప్పి వివక్షను న్యాయబద్ధం చేయలేరు. ఇప్పుడు సుప్రీంకోర్టు విచారణ కూడా ఒక కేసు పరిష్కారం కాదు, దేశం ఎలా నడుచుకోవాలో చేసే దిశానిర్దేశం. ఇకనైనా ఆచారాల పేరుతో చేసే రాజకీయాలకు కాలం చెల్లాలి. సమానత్వమే కొత్త ఆచారంగా స్థిరపడాలి.

# అలరించిన సుమధుర సినీ నేపథ్య గేయాలు

**మొదటిపేజీ తరువాయి**

వాయులీన కళాకారులు శ్రీకాకుళం మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ వ్యవస్థాపకులు మావుదూరు సత్యనారాయణ శర్మ, శ్రీ రాజరాజేశ్వరి దేవి పీఠం వ్యవస్థాపకులు డాక్టర్.సుసరాపు.లక్ష్మీగణపతి శర్మ, శ్రీవాణి సంగీత కళాక్షేత్రం వ్యవస్థాపకులు దుంపల. ఈశ్వరరావు, శ్రీకాకుళం రంగస్థలం కళాకారుల సమాఖ్య అధ్యక్షులు ఎల్.రామలింగ స్వామి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజలను చేసి పిబి శ్రీనివాస్ చిత్రపటాన్ని పుష్ప మాలాన్ కృతులను చేసి ఘనంగా నివాళి అర్పించారు.

అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ బాలు, ఘంటసాల గారికి అందరూ జయంతి వర్ధంతి కార్యక్రమాలు చేస్తారని, పిబి శ్రీనివాస్ గారికి చేయటం అన్నదే అభినందించ తగ్గ విషయమని కొనియాడారు.

కార్యక్రమానికి సంగీత సారథ్యం వహించి, గాయకులకు శిక్షణ ఇచ్చిన కేవీఎన్ మూర్తిని, ముఖ్య అతిథులు, గాయకులు, శిష్య బృందం ఘనంగా సత్కరించారు. అనంతరం కళాకారులను దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో గాయకులు చౌదరి రమేష్ , మార్గదర్శి శ్రీనివాస్, కూన రాజారావు ఎం.వి.ఆర్ శ్రీనివాస్, కంచరాన అప్పారావు, జి సుబ్రహ్మణ్యం, డి.శ్రీరామచంద్రమూర్తి, వైఈఏ నారాయణ, ఆమని, దివిలి హేమచంద్ర, ఎంవి కామేశ్వరరావు చక్కని పాటలను ఆలపించారు. కార్యక్రమానికి కీబోర్డుపై ముంజేటి రాజు, అప్పారావు సహకరించగా తబలాపై సూర్యనారాయణ, పాడ్స్ పై బుజ్జి, ఎంవీ.కామేశ్వరరావు సహకరించగా, వ్యాఖ్యాతగా మార్గదర్శి శ్రీనివాస్ వ్యవహరించారు.

# ఖైదీల హక్కుల రక్షణ మనందరి బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**

బాధపడుతున్న ముద్దాయిల కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. రాబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేస్తూ.. గతంలో మాదిరిగానే ఈసారి కూడా రికార్డు స్థాయిలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించాలని పిలుపునిచ్చారు. రాజీ ద్వారా కక్షిదారులకు సమయం, ధనం ఆదా అవ్వడమే కాకుండా జిల్లాలో నేరాల నిష్పత్తి తగ్గుతుందని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇన్సూరెన్స్ కంపెనీలు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు సత్వర పరిహారం అందేలా చూడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి హరిబాబు, అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్, ఎస్.డి.పి.ఓ వి. వెంకటప్పరావు, అదనపు ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎల్. నాగభూషణ రావు, జైలు అధికారులు పాల్గొన్నారు.

# రక్తందానంతో మరో ఇద్దరికి ప్రాణదానం

**నవతరం -శ్రీకాకుళం**

రక్తదానంతో మరో ఇద్దరికి ప్రాణదానం చేసిన వారం అవుతామని, రక్తదాతలే రియల్ హీరోలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జాతీయ సర్వేయర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో బుధవారం జిల్లా సర్వేయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గతంలో బ్లడ్‌బ్యాంకు నిర్వహించానని, తాను నాయకుడిని అయ్యేందుకు ఇది ఎంతగానో తోడ్పందని చెప్పారు. రక్తదానంతో మరొకరి జీవితానికి వెలుగును నింపవచ్చని తెలిపారు. సమయానికి రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. రక్తదాతలు ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ప్రాణాలను కాపాడుతారనరి, నిస్వార్థ సేవకు నిదర్శనం రక్తదానం అని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు రక్తం ఎంతో అవసరమవుతుందని, దాతల నుండి



సేకరించిన రక్తాన్ని వారికి అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. ప్రతీ ఒక్కరూ వారి పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి సమయాలలో రక్తదానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. రక్తదాన శిబిరానికి రక్తదానం చేసేందుకు వందలాది మంది యువకులు రావడం, సమాజం పట్ల బాధ్యతతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, బ్లడ్ డొనేషన్‌పై అపోహలను వీడాలని, 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చునని తెలిపారు.

# అందవరం గ్రామంలో మన ఊరు-మన జెండా



**నవతరం -జలుమూరు**

జలుమూరు మండలం అందవరం గ్రామంలో బీజేపీ "మన ఊరు--మన జెండా" కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు జెండా ఆవిష్కరించి అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జాతీయ భావన పెంపొందించడమే కార్యక్రమ లక్ష్యమని, ౹ు= కోడ్ ద్వారా కేంద్ర నిధుల వివరాలు తెలుసుకునేలా చేస్తామని తెలిపారు. గ్రామస్తులు తమ సమస్యలను వివరించగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సుమారు 30 కుటుంబాలు బీజేపీలో చేరగా, గ్రామస్తులు భారీగా పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమంకోసం రాజీలేని పోరాటం

**నవతరం -అనకాపల్లి**

జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ఏపీ స్టేట్ ఇన్‌చార్జ్ ఎన్. ఈశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం ఎస్ రాయవరం మండలం కుమార్ దాబాలో నిర్వహించిన ఐ ఎఫ్ డబ్ల్యు జే పరిచయ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత 76 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో జర్నలిస్టుల హక్కుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని, అదే దిశగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా కృషి కొనసాగిస్తామని తెలిపారు.

జర్నలిస్టులకు రావాల్సిన సంక్షేమ సదుపాయాలను ప్రభుత్వం నుండి సాధించేందుకు కట్టుబడి పనిచేస్తామని అన్నారు. జర్నలిస్టులకు వివిధ కమిటీల్లో ప్రాధాన్యం కల్పించేందుకు ప్రయత్నిస్తామని, వారిపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో జర్నలిస్టులకు అందాల్సిన సదుపాయాలు పూర్తిస్థాయిలో అమలు కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో ఐ ఎఫ్ డబ్ల్యు జే నిర్మాణ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో రీజినల్ ప్రతినిధి ఎన్.వి. మల్లేశ్వరావు, శ్రీకాకుళం ఇన్‌చార్జ్ జయవర్ధన్ కూడా మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు.

అనంతరం ఐ ఎఫ్ డబ్ల్యు జే కార్యవర్గాన్ని ప్రకటిస్తూ, కొత్త కన్వీనర్లుగా మొల్లేటి రుద్రాచారి, కర్రీ శ్రీనివాసరావు, సకల నాగేశ్వరరావు, సబ్బి నాగేశ్వరరావు, బెందుర్తి ధర్మయ్యలను నియమించారు.

# నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**మొదటిపేజీ తరువాయి**

చర్యలను ప్రభుత్వం తీసుకుందని అన్నారు. ఉన్నత పాఠశాల ఆవరణంలో పచ్చదనం ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు, ఆర్డీఓ ఎమ్.కృష్ణ మూర్తి, డి ఎల్ డిఓ అలివేలు మంగ, ఎమ్ పీ డీ వో రేణుక, తాసిల్దార్ సత్యం, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎమ్.సుధాకర్, మండల విద్యాశాఖ అధికారి తులసి రావు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి కె.రామ కృష్ణ, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు దాట్ల దాశరధి, ఉపాధ్యాయులు బి.అరుణ్ కుమార్, ఆర్. శ్రీనివాస్, రామిరెడ్డి, తదితరులు, పాల్గొన్నారు

# టార్చ్ ఫిన్‌టెక్ ఇండియాతో వర్సిటీ ఎంఓయూ

**నవతరం -ఎచ్చెర్ల**



డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం మరియు హైదరాబాద్‌కు చెందిన టార్చ్ ఫిన్‌టెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం (వీశీఖ) కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా విశ్వవిద్యాలయ విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు, స్వయంసాధన కోర్సులు, మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించబడతాయి.

ఈ భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు ఇంటరాక్టివ్ సెషన్లు, RTIH మరియు SEEDAP లింకేజీలు, మెంటార్‌షిప్ అవకాశాలు, మరియు స్టార్టప్‌ల కోసం బ్యాంక్ లింకేజీలు ఉచితంగా అందించబడతాయి. ఈ కార్యక్రమాలకు కావలసిన నిధులు భారత ప్రభుత్వంలోని మీవీజు విభాగం ద్వారా సమకూర్చబడతాయని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె. ఆర్. రజని, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. అడ్డాయి, టార్చ్ ఫిన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ వైభవ్ సీపాన, అధ్యాపకులు పాల్గొన్నారు.

# విస్మృత రచయిత

కొంతమందికి చాలా విషయాలపై మంచి పట్టు ఉంటుంది. అయినప్పటికీ ఎక్కడా కూడా తామే గొప్ప వారమని చెప్పుకోరు. అనవసర వాదనలకు దిగరు. తమ పని తాము చేసుకొని పోతారు. అటువంటి వారిలో తిరువూరుకు చెందిన రచయిత అల్లాడ నారాయణ రావు ఒకరు.

ఆయన 1943సెప్టెంబర్ 11న వెంకటేశ్వరరావు, మంగ తాయారమ్మ దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి హోమియో వైద్యులు. నారాయణ రావు భాషా ప్రవీణను పూర్తి చేశారు. తిరువూరు, గంపలగూడెం తదితర ప్రాంతాల్లో తెలుగు పండితుడిగా పని చేశారు. తర్వాత అగిరిపల్లిలో తెలుగు అధ్యాపకులుగా సేవలు అందించారు. ఆయన పుస్తకాలు బాగా చదివే వారు. పురాణం కుమార రాఘవ శాస్త్రి గారి శిష్యరికంలో రచయితగా ఎదిగారు. తెనాలి రామకృష్ణ, మణి పూసలు, మహా భారతంలో కర్ణుని పాత్ర -వ్యక్తిత్వం, త్యాగ రాజు స్వామి జీవిత చరిత్ర వంటి రచనలు చేశారు. ఆయన రాసిన మరికొన్ని పుస్తకాలు ఇంకా ఆముద్రితంగానే ఉన్నాయి. ఆయన రాసిన మణి పూసలు పుస్తకాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 8వ తరగతి తెలుగు పాఠ్య పుస్తకంలో ఉప వాచకంగా కూడా చేర్చారు. 1996లో ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్ వారి నుండి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని పొందారు. ఇంకా పలు సన్మానాలు పొందారు. ఆయన 2024ఏప్రిల్ 15న తిరువూరులో తుదిశ్వాస విడిచారు. ఆయనకు తెలుగు, ఇంగ్లీష్ భాషలపై మంచి పట్టు ఉండేది. పదవీ విరమణ చేశాక కూడా నిరంతరం తిరువూరు లైబ్రరీకి వచ్చేవారు. ఆయనలో మంచి ప్రతిభ ఉన్నప్పటికీ, నేటి తరానికి పెద్దగా తెలియదు. విస్మృత రచయితగా మిగిలి పోయారు.

(ఏప్రిల్ 15-నారాయణ రావు గారి తృతీయ వర్ధంతిని పురస్కరించుకొని)


యం.రాం ప్రదీప్

# విజిబుల్ పోలీసింగ్‌తో నేరాలు అరికట్టే చర్యలు చేపట్టాలి

- జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి, ఐపీఎస్
- వార్షిక తనిఖీల్లో భాగంగా జి. సిగడాం పోలీసు స్టేషన్ పరిశీలన



**నవతరం -శ్రీకాకుళం**

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి బుధవారం జి. సిగడాం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ ఆవరణలు, రికార్డులు, కేసు ప్రాపర్టీలను సమగ్రంగా పరిశీలించి,నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. రిసెప్షన్ సెంటర్‌లో ప్రజా ఫిర్యాదుల నమోదు విధానం, వాటి పరిష్కార స్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రజలకు పారదర్శకత పాటించి త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి, ఆలస్యానికి గల కారణాలను ఆరా తీసి దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది, ముఖ్యంగా మహిళా పోలీసుల విధి నిర్వహణపై ఆరా తీసిన ఎస్పీ, గ్రామాల్లో జరుగుతున్న అనవసర ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, సమాచారాన్ని వెంటనే సంబంధిత ఎస్సైకు అందించాలని సూచించారు. 'నారీ శక్తి సంకల్పం' కార్యక్రమాల ద్వారా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం పెంపొందించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు కట్టుదిట్టం చేసి, గంజాయి అక్రమ రవాణాను అరికట్టడమే కాకుండా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాత్రి పహారా బలోపేతం చేసి, అనుమానాస్పద వ్యక్తులపై కచ్చితమైన నిఘా ఉంచాలని తెలిపారు. ప్రతి రోజు గ్రామాల సందర్శనలు నిర్వహించి, ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, చిన్నచిన్న వివాదాలను ప్రారంభ దశలోనే పరిష్కరించి పెద్ద గొడవలుగా మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదేవిధంగా స్టేషన్ పరిధిలో ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నేర నియంత్రణలో సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని, పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ వార్షిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ వెంట శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, జె.ఆర్. పురం సీఐ అవతారం, ఎస్సై సందీప్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా పట్టు మహాదేవి
# కోనేరు సుందరీకరణ పనులు



**నవతరం -టెక్కలి**


పట్టణంలోని పట్టు మహాదేవి కోనేరు సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈమేరకు బుధవారం పర్యటనలో భాగంగా పట్టు మహాదేవి కోనేరులో జరుగుతోన్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం చేపడుతోన్న పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి పనుల వివరాలు, కోనేరు రక్షణ గోడ, రివిటింగ్ పనులు, వాకర్స్ ట్రాక్, ఆహ్లాదానికి, ఆకర్షణకు ఏర్పాటు చేయనున్న పచ్చదనం, వసతుల కల్పన పనులను మంత్రికి ఆర్డీవో కృష్ణ మూర్తి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి మణిహారంగా నిలిచేలా తీర్చిదిద్దాలన్నారు. ప్రజలు , సందర్శకులకు ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా కొత్త అనుభూతిని పొందే విధంగా ఉండనుందని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించి అనుకున్న సమయంలోగా సుందరీకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అంతకు ముందు పట్టుమహాదేవి కోనేరుపైనున్న శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామిని మంత్రి దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు వేదమంత్రాల మధ్య ఆశీస్సులతోపాటు తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

# ఒక్క ఛాన్స్.. మళ్లీ అవకాశాల వేటలో హీరోయిన్

కాబోయే భర్త కోసం కెరీర్ నే పణంగా పెట్టింది. త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్టు ఆర్భాటంగా ప్రకటించింది. అంతా ఓకే అనుకున్న టైమ్ లో కాబోయే భర్త నుంచి విడిపోయింది నివేత పెతురాజ్.

ఆ బాధ నుంచి బయటపడేందుకు కొన్నాళ్లు దేశాలు చుట్టొచ్చింది. ఇప్పుడు తన స్వస్థలం దుబాయ్ ను కూడా వీడి చెన్నైలో ల్యాండ్ అయింది. అవును.. ఆమె మళ్లీ తన కెరీర్ ను కొత్తగా ప్రారంభించాలనుకుంటోంది.

మరీ స్టార్ డమ్ రాకపోయినా.. మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా లాంటి మంచి సినిమాలు చేసింది నివేత. ఆమె కెరీర్ లో పెద్ద సినిమా అల వైకుంఠపురములో కాగా.. తాజా తెలుగు చిత్రం దాస్ కా ధమ్కీ. ఆ తర్వాత 'బూ' అనే సినిమా చేసినా అది నేరుగా ఓటీటీలో రిలీజైంది. ఇదంతా 2023 నాటి ముచ్చట. ఇప్పుడామె మళ్లీ అవకాశాల కోసం ప్రయత్నిస్తోంది. తన పరిచయాల్ని మరోసారి బయటకు తీస్తోంది. సెకెండ్ హీరోయిన్ రోల్స్ అయినా ఓకే అంటోంది. సోషల్ మీడియాలో యాక్టివ్ అవ్వడంతో పాటు, పనిలోపనిగా షాపుల ఓపెనింగ్స్ లాంటి కార్యక్రమాలకు కూడా హాజరవుతోంది. తెలుగుతో పాటు తమిళ్ లో కూడా ఆమెకు కాస్త క్రేజ్ ఉంది. కొత్తగా కెరీర్ ప్రారంభించాలనుకుంటున్న నివేత, ఎలాంటి సినిమాతో వెండితెరపైకొస్తుందో చూడాలి.



# పవన్ చెప్పినా పుకార్లు ఆగడం లేదుగా!

కొన్ని రోజుల కిందటి సంగతి. పవన్ సినిమాలపై ఎడతెగని పుకార్లు వస్తున్న టైమ్ అది. దీంతో నేరుగా పవన్ కల్యాణ్ టీమ్ స్పందించింది. ప్రస్తుతానికి పవన్ ఎలాంటి కొత్త సినిమాల్ని టేకప్ చేయడం లేదని, ఇప్పట్లో ఆయన సెట్స్ పైకి రారంటూ స్పష్టత ఇచ్చింది.

అదే టైమ్‌లో ఓజీ సీక్వెల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది పవన్ టీం. ఓజీ సీక్వెల్ పై స్వయంగా పవన్ స్పందిస్తారని, ఆ టైమ్ వచ్చినప్పుడు ఆయనే ప్రకటన చేస్తారనేది దాని సారాంశం. అప్పట్లో విస్పష్టంగా ప్రకటన చేసినప్పటికీ, తాజాగా మరోసారి పుకార్లు రావడం విశేషం.



ఓజీ సినిమాకు ప్రీక్వెల్ రెడీ అవుతోందంట. దీనికి ఓజాస్ గంభీర అనే టైటిల్ అనుకుంటున్నారట. ప్రస్తుతం దర్శకుడు సుజీత్ ఈ పనిమీదనే బిజీగా ఉన్నాడంటూ కథనాలు వస్తున్నాయి. త్వరలోనే పవన్ ఈ ప్రాజెక్టును ప్రకటిస్తారని.. పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్, పీపుల్ మీడియా, డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సంయుక్తంగా ఈ సినిమా వస్తుందనే ప్రచారం నడుస్తోంది.

ఇదే అంశంపై పవన్ కల్యాణ్ టీమ్‌కు చెందిన వ్యక్తుల్ని సంప్రదించింది గ్రేట్ ఆంధ్ర. ప్రస్తుతం టేబుల్‌పై అన్ని ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. కేవలం ఓజీ ప్రీక్వెల్ మాత్రమే కాదు.. సురేందర్ రెడ్డితో చేయబోయే సినిమా కూడా టేబుల్‌పై ఉందంట. అటు ఏఎం రత్నం కూడా పవన్ తో టచ్‌లో ఉన్నారంట. కానీ నిర్ణయం మాత్రం తీసుకోలేదనేది పవన్ టీమ్ నుంచి వస్తున్న క్లారిటీ.

# 700 సంవత్సరాల నుండి వెలుగుతున్న నందా దీపం ఆలయం



సిరిసిల్ల రాజన్న జిల్లా గంభీరావుపేటలో...
మన హిందూ సంప్రదాయంలో ఆలయాల్లో నిత్య పూజలు దీపారాధనలు జరగడం సాధారణమే కానీ కొన్ని ఆలయాల్లో జరిగే ఆచారాలు అచంచల విశ్వాసాలు మాత్రం మనల్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంటాయి అలాంటి ఆలయాల్లో...
రాజన్న సిరిసిల్ల జిల్లా తెలంగాణ రాష్ట్రం,పూర్వపు కరీంనగర్, గంభీరావుపేటలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం సుమారు 700 ఏళ్ల చరిత్ర కలిగిన కాకతీయుల కాలం నాటి పవిత్ర క్షేత్రం. క్రీ.శ. 1333-1314 కాలంలో, కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు దీనిని నిర్మించారని, ఇక్కడ సుమారు 7 శతాబ్దాలుగా నిరంతరాయంగా వెలుగుతున్న "నందాదీపం" అత్యంత ప్రత్యేకత అని తెలుస్తోంది. నందా దీపం వెలుగుతుండటమే ఆ గ్రామానికి ఐశ్వర్యాలు కలుగజేస్తుంది అనే విశ్వాసం.ఇన్నేళ్లుగా గండ దీపం వెలగడం మామూలు విషయం కాదు భక్తులు పోసే నూనెతోనే గండాదీపం నిరంతరం వెలుగులీనుతుంది,ఇన్ని విశేషాలు ఉన్న ఆలయాన్ని అందరూ సందర్శించి తమ మొక్కులు చెల్లిస్తూ ఉండడం విశేషం.

నిర్మాణం: 14వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో ఈ ఆలయ నిర్మాణం జరిగిందని, ఆలయ గంటపై 1333 అనే సంఖ్య కనిపిస్తుంది. ఇది నిర్మాణ కాలాన్ని సూచిస్తుంది.

నిరంతర నందాదీపం: ఈ ఆలయంలోని ప్రధాన విశేషం 700 సంవత్సరాలకు పైగా వెలుగుతున్న అఖండ దీపం, మూలవిగ్రహాల ప్రతిష్ఠకు ముందే ఈ నందాదీపాన్ని వెలిగించినట్లు స్థల పురాణం చెబుతోంది.

చారిత్రక నేపథ్యం,నిజాం కాలంలో లింగన్నపేట సంస్థానాధీశులు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. ఇక్కడికి సమీపంలోని వెంకటాద్రి చెరువు నుండి ఉత్సవాలకు నీటిని తీసుకువస్తారు. గర్భగుడి ముందు గల,కాకతీయుల నిర్మాణ శైలిలో 16 స్తంభాలతో కూడిన కల్యాణ మండపం ఇక్కడి ప్రత్యేకత.



### ఆలయ చరిత్ర:

కాకతీయులు తమ రాజ్యంలోని కొన్ని గ్రామాలను పాలన ప్రాంతాలుగా పరిగణించి, గంభీరావుపేటను ప్రధాన కేంద్రంగా మార్చుకున్నారు. క్రీస్తుశకం 1333లో కాకతీయ రాజులలో చివరివాడైన ప్రతాపరుద్రుడు ఈ ఆలయాన్ని నిర్మించాడు. నిజాం పాలనలో లింగన్నపేట సంస్థానానికి సంస్థానాధీశుడిగా ఉన్న వేంకటరావు దేశాయి ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేశాడని తెలుస్తోంది.

### ఆలయం ప్రత్యేకత:

16 స్తంభాలతో నిర్మించిన కల్యాణ మంటపం ఇప్పటికి చెక్కు చెదరకుండా నిలిచివుంది. దేవాలయానికి కొంత దూరంలో సంస్థానాధీశుడి పేరుమీద నిర్మించిన వెంకటాద్రి చెరువునుంచి ఆలయంలో జరిగే అన్ని ఉత్సవాలకి నీటిని తెస్తారు. ఆలయంలోపల ఉన్న గంటపై 1333 అనే సంఖ్య ఉంది. ఈ సంఖ్యను బట్టి ఈ ఆలయం కాకతీయుల కాలం నాటిదని చెప్పవచ్చు. ఈ ఆలయంలో ఒక నందాదీపం ఉంది. మూల విగ్రహాల ప్రతిష్ఠకు ముందే ప్రతిష్ఠించబడిన ఈ నందాదీపం నాటినుంచి నేటివరకు వెలుగుతూనే ఉందని పూర్వీకులు తెలియజేస్తారు.

ప్రతి సంవత్సరం ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి ఏ ఉత్సవాల్లో భాగంగా దేవుడిని రథంపై ఊరేగిస్తారు. ప్రతి సంవత్సరం 18 స్తంభాల ఛత్రాకారం మంటపములో శ్రీ రామనవమికి వేలాదిమంది భక్తులతో శ్రీ సీతారామ కల్యాణం వైభవంగా నిర్వహించి అన్నదానం చేస్తారు. ఇక్కడి మూలవిరాట్ భద్రాచల రామయ్యను పోలి ఉండటం భక్తులను విశేషంగా ఆకర్షిస్తుంది.

### మంచి మాట: మహర్షుల దూరదృష్టి

ఎంవలకాలం రాబోతోందనగానే ముందుకి ముందుగా గొడుగుని సిద్ధం చేసుకున్నట్టూ, శీతాకాలానికి ముందు గానే చలిని ఆపగల మందపు దుప్పటిని జాగ్రత్త చేసుకున్నట్లూ మహర్షులందరూ రాబోయే కాలాన్ని తమ దివ్యదృష్టితో ముందుకి ముందు గానే పరిశీలిస్తారు.ఆ పరిశీలనలో లోకంలోగాని దుర్మార్థులూ, క్రూరులూ పుట్టబోతున్నారని తెలిస్తే, మరో పనికి పోకుండా తపస్సుని ప్రారంభించేస్తారు, లోక క్షేమం కోసం,
ఇది నిజం కాబట్టే పదమూడు సంవత్సరాల వయసున్న రామచంద్రునికి విశ్వామిత్రుడు అనేక అస్త్రాల మంత్ర శక్తిని అందించగలిగాడు.
యుద్ధభూమిలో రావణుణ్ణి ఎది రించలేక (చింతయాస్థితమ్) దీర్ఘ చింతతో ఉన్న రామునికి అగస్త్యుడు ఆదిత్య హృదయస్తోత్ర మంత్రాన్ని ఉప దేశించగలిగాడు.
ఈ ఇద్దరే కాక మరి ఎందరో మహర్షులు కూడా తమ తమ తపశ్శక్తుల్ని రామునికి స్వయంగా ధారపోయగలి గారు ! మహర్షులది ఎంత దూరదృష్టి ! మనమీద వారికెంతటి వాత్సల్యం !.
ఆలయం చేరుకోవడానికి మార్గాలు :
సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట లోని శ్రీ రామచంద్ర ఆలయానికి గంభీరావుపేట మండలం చేరుకోవడానికి సిరిసిల్ల సుమారు 20 -25 కిలోమీటర్లు, కామారెడ్డి నుంచి 30 కిలోమీటర్లు నుండి బస్సు లేదా సొంత వాహనాల ద్వారా సులభంగా చేరుకోవచ్చు. సిరిసిల్ల పట్టణం నుండి ఉత్తర దిశగా గంభీరావుపేట మండలానికి బస్సులు ఆటోలు అందుబాటులో ఉంటాయి. కామారెడ్డి నుండి కూడా రోడ్డు మార్గం ద్వారా గంభీరావుపేటకు చేరుకొని ఆలయానికి వెళ్ళవచ్చు.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# రోడ్డు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

## పొలిటికల్ అడ్వైజర్ హరికృష్ణ

**నవతరం-శ్రీకాకుళం**



ఆంధ్రజ్యోతి సబ్ ఎడిటర్ రాజేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పొలిటికల్ అడ్వైజర్, చిక్కోలు చిరుదువ్వే ఫౌండర్ హరికృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా ఫరీదుపేట సమీపంలో జరిగిన ఈ ప్రమాదం అత్యంత దురదృష్టకరమన్నారు. ప్రస్తుతం ఆయన బ్రెయిన్ ఇంజ్యూరీతో ఆస్పత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్నారని తెలిపారు . రాజేష్ నిబద్ధత కలిగిన జర్నలిస్టుగా సమాజానికి ఎంతో సేవలందించారని తెలిపారు.దశాబ్దానికి పైగా ఆంధ్రజ్యోతి పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తూ ప్రజలకు నిజమైన సమాచారం అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని వివరించారు. అలాగే స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు,తను ఒక లాయర్ గా ఎంతో మంది నిస్సహాయులకు ఎల్లప్పుడూ మద్దతు ఇస్తూ, సమాజానికి మేలు చేసే విషయాలను ప్రోత్సహించిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.
ఈ క్లిష్ట సమయంలో ఆయన త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని తెలిపారు.వైద్యులు అందిస్తున్న చికిత్సతో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో మళ్లీ తన సేవలను కొనసాగించాలని ఆశిస్తున్నానని వివరించారు.
రాజేష్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పుతూ, ఈ కష్టకాలాన్ని అధిగమించే శక్తిని ఇవ్వాలని దేవుడిని ప్రార్థిస్తునాన్నని పేర్కొన్నారు. అవసరమైతే మా "చిరు దివ్వే చైతన్య ఫౌండేషన్" తరపున అన్ని విధాల సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా తెలియజేసారు.

# సిఐటియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



**నవతరం-రణస్థలం**

**- లేబర్ కోడ్స్ రద్దు చేయాలి**
**- కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలి**
**- సి.హెచ్. అమ్మన్నాయుడు**

ఏప్రిల్ 17, 18, 19 తేదీలలో నంద్యాలలో నిర్వహించనున్న సిఐటియు రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. మహాసభల విజయాన్ని కోరుతూ పైడిభీమవరంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1970లో ఐఖ్యతా పోరాటం నినాదంతో స్థాపించబడిన సిఐటియు నేడు భారతదేశంలోని ప్రధాన కేంద్ర కార్మిక సంఘంగా ఎదిగిందన్నారు. కార్మికుల హక్కులు, వేతనాలు, పని పరిస్థితుల మెరుగుదల, సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడుతున్నదని తెలిపారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికుల పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో 4 లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని విమర్శించారు. ఈ లేబర్ కోడ్స్ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే విధంగా ఉన్నాయని పేర్కొంటూ వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
కార్మిక హక్కులు ఎప్పుడూ ప్రభుత్వాలు స్వచ్ఛందంగా ఇచ్చినవి కావని, పోరాటాల ద్వారా సాధించుకున్నవేనని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలను సవరించలేదని, కనీస వేతనం రూ. 26,000గా నిర్ణయించి అమలు చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పి. రామకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలు పక్కాగా ఉండాలి

## రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**నవతరం-శ్రీకాకుళం**

రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్ ను ఆదేశించారు. బుధవారం నందిగాం మండలం సుభద్రాపురం, కాపుతెంబూరు గ్రామంల్లో రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలను ఇంటింటికి వెళ్లి స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టాదారు పాసు పుస్తకాలలో భూ పరిమితి, ఆధార్, ఫోన్, పేర్లు, తదితర వివరాలను ఆయన పరిశీలించారు.
రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలలో ఉన్న వివరాలు సరిపోయింది లేనిది సంబంధిత రైతులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చినందుకు రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**